పడింది. తను వద్దని చెప్పాడు. కాదని మిత్రుడు ఆ విత్తనం తనవైపు నాటాడు. అది అతని చేతి మీదుగానే పెరిగింది. దాని విధేయత అంతా పార్వతీశానికే. అది అర్థం చేసుకోలేక పోయాడతను. పాపం ఆవేశంలో అసలు పాయింటు మిస్సయ్యాడు. సింపథైజ్ చేశాడు. తనక్కడ ఉంటే పరిస్థితి వర్సెనవుతుందనుకున్నాడు.

మర్నాడు వెంకటేశం ఇల్లు మారాడు. మనస్సులు మారితే యిల్లొక్క లెక్కా. కారణం ఆ యింట్లో ఏదో వచ్చినప్పటినుంచీ నష్టజాతకమని చెప్పాడు. పార్వతీశం ఈ 'సడెన్ డెసిషన్' విని 'స్టుపిఫై' అవలేదు. 'ఆల్ రైట్' అనాలేదు. విని ఊరుకున్నాడు."

"అయిపోయిందా?"

"ఏం? అయ్యింది."

"చిన్న సజెషన్, మర్నాడు పార్వతీశం ఈ భాగంలోకి మారాడంటే ఎలా ఉంటుంది?"

"ఎందుకంత క్రూయెల్‌గా ఉండటం."

"వాడి మనస్సింతా బాగా తెలుస్తుంది."

"యుఁవర్ విల్."

"మాష్టారూ ఈ సొల్యూషన్ ఎడాప్టుచేసి వ్రాసేస్తాను - మీకు చూపుతాను - ఏమంటారు?"

"ఆల్ రైట్ - నే నెప్పుడు కాదన్నాను. సాక్రిఫైస్ ఈస్ మై బర్త్ రైట్."

"సో—ది అథర్ విల్ బిగ్రేట్ ఫుల్ టు డాక్టర్ రావు."

"దానికేంలే ఎప్పుడూ ఉన్న దేగా."

"అయినా మెన్షన్ చేయకపోతే ఐ ఫీల్ గిల్టీ."

"థ్యాంక్స్"

మే మిద్దరం విడిపోయాం. ఆ రోజున ఎండింగ్ యొక్క డిఫకల్టీ నాకు తెలిసింది. ఆ కథ వ్రాసేశాను—అంతే!

---

కథానిక

# స్వర్ణయోగం

## "భాస్కరం - ప్రభాకరం"

జుట్టు పట్టుకుని ద్రౌపదిని దుశ్శాసనుడు సభలోకి ఈడ్చుకొచ్చినట్టు, మెడపట్టుని టార్జాన్‌ని గదిలోకి లాక్కొచ్చాడు శేషు.

"చూశావురా, నీడిటుక్కులు? మెయిన్‌రోడ్డు మీద నాకెదురొస్తున్నాడు. నన్ను చూడగానే పక్కసందులోకి మళ్ళి పోయాడు. నేను చూడలేదనుకున్నాడు. పోనిచ్చానా, వెనకాలే వెళ్ళి పట్టుకుని, కథ చెప్పుదు లే రమ్మని నాతో తీసుకొచ్చాను" అన్నాడు శేషు.

"అవునుగాని రాఘవులొచ్చాడు వూళ్ళోకి, తెలుసా?" అన్నాను.

"తెలియడమేమిటి! ఇప్పుడు రాఘవులు దగ్గర్నుంచేగా నేను వస్తున్నది!" అన్నాడు శేషు.

"ఏమిటి విశేషాలు?" అని అడిగి నాలిక కరుచుకున్నాడు టార్జాన్.

"అడిగావూ? అదే చెపుదామనుకుంటున్నాను. నువ్వే అడిగావు. విను." అని ప్రారంభించాడు శేషు.

"క్వార్ట్జ్—గార్నెట్—సిలిమనైట్ గ్రాఫైట్ షిస్టు. స్ట్రైకింగ్ నార్త్ నలభయ్యయిదు డిగ్రీలు ఈస్టు డిప్పింగ్ యాభయ్యారు డిగ్రీలు సౌత్..."

ఫీల్డు నోట్సు రాసుకుంటున్న రాఘవులు కళ్ళు మిరుమిట్లు గొల్పేలా మెరుపుమెరిసి ఫెళఫెళమని ఉరిమింది. ఉత్తరాన దూరంగా కాటుక కొండలా మబ్బుకనపడి మదించిన ఏనుగులాముందుకొస్తోంది.

రాఘవులు నోట్సురాయడం ఆపుచేశాడు. రిస్టువాచీ చూసుకున్నాడు. అ యి ద యి ం ది. సామాన్యంగా ఆరున్నర అయితేగాని చీకటిపడటం లేదు. అందుచేత ఏ రోజు కారోజు తన ప్రోగ్రాం ప్రకారం ఫీల్డువర్కు సాగిపోతూవుండేది. ఇవాళ తను వేసుకున్న ప్రదేశం చిన్నదే అయినా గుట్టలూ మిట్టలూ ఎక్కడందిగడంతో ఆలస్యమయి పోయింది. ఇంకా సగం ఏరియా వుండిపోయింది.

మబ్బు వేగంగా మూసుకువస్తోంది. రాఘవులుకి ఏమీ పాలుపోలేదు. వీలయినంత త్వరగా క్యాంపు

చేరుకోవటం మంచిదనిపించింది. ఫీల్డుమ్యాపు తీసి చూసుకున్నాడు.

తను నిలబడినది 'గౌరిదేవి మెట్ట'మీద. ఉత్తరంగా కొండదిగితే కాలిబాట. కాలిబాట పట్టుకుపోతే తన క్యాంపు చింతలవలస. అయితే ఈ కాలిబాట, చుట్టుదారి. ప్రయాణం గంటన్నర పడుతుంది. దారిలో వానకురిస్తే, తనూ, తన కాంపస్ క్లైయినోమీటరూ, హోవర్ సాకూ, కెమెరా, ఫీల్డుమాపూ, సమస్తం తడిసి ముద్దయి పోతాయి.

అంతకన్నా దగ్గరదారి ఇంకొకటుంది. 'గౌరిదేవి మెట్ట'కి తూర్పుగా 'బంగారమ్మకొండ.' దయ్యాలమిట్ట దిగితే చింతలవలస. మిట్టపల్లాలమీద ప్రయాణం కొంచెం కష్టమే అయినా అరగంట ప్రయాణం. పోనీ, మహా అయితే ముప్పావుగంట సరాసరి క్యాంపు చేరుకోవచ్చు.

చల్లగాలి రేగింది. రాఘవులు బయల్దేరాడు తొందరగా, 'బంగారమ్మకొండ' వైపు. దూరంగా తాటిచెట్లు గాలికి తలలూపుతున్నాయి. అంతకంతకీ గాలి హెచ్చిపోయింది. చీకటి పెరిగిపోయింది. రాఘవులి కెక్కడా కూతవేటు దూరంలో మనిషి కనపడలేదు.

పది నిముషాలయేసరికి రాఘవులు బంగారమ్మ కొండ దరిదాపుల కొచ్చాడు. చింతలవలస మునసబు బంగారమ్మ కొండమీద బంగారం గురించీ, దయ్యాల కొండమీద దయ్యాల గురించీ, ఏదో చెప్పాడు క్రితంరోజు. ఖొండలైటు సైసెన్‌లో బంగారం దొరకడం ఎంత సంభవమో, దెయ్యాల మిట్టలో దెయ్యాలుండడంకూడా అంతే నిజం అనుకున్నాడు రాఘవులు. కాని ఇప్పుడు తనని వేధిస్తున్న దొకటే సంశయం: తను వెడుతున్నదారి సరైనదో, కాదో అని... అయినా కొంచెం వోపికపట్టితే ఊరు చేరలేక పోతాడా?

"ఓయ్, పంతులూ!"

రాఘవులికి గుండె ఆగినంత పనైంది. ఎవరో వెనకనుంచి తనని పిలిచారు. ఇందాకా తను అటు వైపునుంచే వచ్చాడు. అప్పుడు తనకి ఎవరూ కనపడలేదు!

రాఘవులికి సి. వి. గుర్తుకొచ్చాడు. "ఒరేయ్, నీ పేరు సాక్షాత్తూ ఆ రామచంద్రమూర్తి పేరు. నీ ఫీల్డువర్కు సమయంలో నీ పాదరజం ఏ పాషాణానికేనా సోకి అదిగాని అహల్య అయిపోతే, రాయి వొక్కంటికి వొక అహల్య చొప్పున మొత్తం నూటయాభై స్క్వేరుమైల్సుకీ వున్న..." అని వేళాకోళం చేస్తూండేవాడు. ఇప్పుడు హఠాత్తుగా ఈ మనిషి కనబడగానే సి.వి.మాటలు జ్ఞాపకం వచ్చాయి.

తనని పిలిచిన వ్యక్తి వెనకనుంచి వస్తున్నాడు. దయ్యాల మిట్టమీదనుంచి కాదుకనక దయ్యం అనుకునేందుకు వీలులేదు.

"ఓయ్, పంతులూ! మనదేవూరు?"

"ఈవూరు కాదులే, వాల్తేరు."

"ఈ వేళప్పుడు యీ కొండమీద ఏం చేస్తున్నావ్?"

తను జియలాజికల్‌గా ఈ ప్రదేశాన్ని మాప్ చేస్తున్నాడనీ, యీరోజు హఠాత్తుగా మబ్బు వెయ్యటంవల్ల పని ఆగిపోయిందనీ, చింతలవలసకి దగ్గరదారి గనక యిలా బయలుదేరాడనీ, చీకటి ముదరడంవల్ల తప్పుదారేమోనని భయపడుతూ ఆగాడనీ, రాఘవులు కొత్త మనిషితో చెప్పుకున్నాడు.

"ఈ వూరివాళ్ళెవ్వరూ యీవేళప్పుడు యీ కొండమీదికి రారు. తెలుసా?"

"మరి నువ్వెందుకొచ్చావ్?"

రాఘవులు సమాధానంకోసం అతనివైపు చూచాడు. చీకటిలో సరిగ్గా కనబడకపోయినా అరవయ్యేళ్ళ ముసలాడులా గోచరించాడు అపరిచితుడు. పొడుగుచేతుల చొక్కా, పంచా, తలపాగా ధరించాడు. సన్నగా పొడుగ్గావున్నాడు.

అపరిచితుడు రాఘవులు ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. రాఘవులే అన్నాడు:

"నువ్వుకూడా నాలాగే పెందరాళే బయల్దేరావు. అవునా?"

"అవును."

"దారిలో మబ్బేసింది. నువ్వుకూడా చింతలవలసకేనా?"

"అవును."

"నీకు దారితెలుసా?"

"తెలుసు."

"అయితే పద, కబుర్లుచెప్పుకుంటూ పోదాం."

ఇద్దరూ దయ్యాల మిట్టవైపు నడవటం ప్రారంభించారు. రాళ్ళు గుట్టలుగుట్టలుగా పడివున్నాయి. మెల్లిగా దారిచూసుకుంటూ వెడుతున్నారు.

"ఆ కుడిపక్క వరలులేని నుయ్యి వుంది. జాగ్రత్తగా చూసుకుంటూ నడు."

"నుయ్యా! ఇక్కడా?" అని ఆశ్చర్యంగా అడిగాడు రాఘువులు.

"అవును. నువ్వు నుంచున్నచోట పూర్వం ఒక పెంకుటిల్లు వుండేది."

"ఈ కొండలమధ్యనా?" చకితుడవుతూ ప్రశ్నించాడు రాఘువులు.

"దీని కథ నీకెవరూ చెప్పలేదూ?" సమాధానం కోసం నిరీక్షించకుండా ముందుకి నడుస్తున్నాడు అపరిచితుడు. అపరిచితుడు చిన్న దగ్గరదగ్గిరయిలా ప్రారంభించాడు:

* * *

నువ్వు నిలుచున్నచోట పూర్వం ఒక పెంకుటిల్లు వుండేది. ఇల్లుగల ఆసామీ పేరు సుందరయ్య.

గ్రామానికి దూరంగా సుందరయ్య ఇల్లు కట్టడాన్ని గురించి నలుగురూ నాలుగువిధాలా అనుకున్నారు. 'బంగారమ్మ కొండమీద సిద్ధుడు ఇతని బంధువు' అని కొందరన్నారు. సుందరయ్యకి నరాల బలహీనత. విశ్రాంతికోసం గాలికోసం కొండమీద కొంప కట్టుకున్నాడు' అని అన్నారు కొందరు ఉదారులు. 'సిద్ధుడూ, సుందరయ్యా ఏదో గూడు పుఠాణీ చేస్తున్నారు, లేకపోతే సుందరయ్య అక్కడ యిల్లెందుకు కడతాడు!' అన్నారు కొంతమంది నాస్తికులు.

నాస్తికులు అన్నదానిలో సత్యం లేకపోలేదు. సిద్ధుడు పగలంతా సమాధిలో వుండేవాడు. సాయంకాలం భక్తులకి దర్శనమిచ్చి భగవద్గీతో, కృష్ణకర్ణామృతమో, కైవల్యనవనీతమో ఉపదేశిస్తూండేవాడు. రాత్రి గంటసేపు గ్రామస్థులు భజనచేసి తరువాత ఇళ్ళకి చేరుకునేవారు. సిద్ధుడు లోపలిగదిలోకి వెళ్ళిపోయేవాడు.

లోపలిగదిలో సుందరయ్య, సిద్ధుడూ స్వర్ణయోగంలో వుండేవారు. సుందరయ్యకి సిద్ధుడు పూర్వాశ్రమంలో ఏదో దూరపుచుట్టం. అది పురస్కరించుకుని సుందరయ్య ఈ స్వర్ణప్రయత్నం తలపెట్టాడు.

కావలసిన మూలికలూ, సంభారాలూ సుందరయ్య సంపాదించితెస్తూ వుండటం, సిద్ధుడు మంత్రతంత్రాలు నిర్వహించటం జరిగేది.

స్వర్ణయోగంగురించి సుందరయ్య చాలా విన్నాడు. ఇంగ్లీషువాళ్లుకూడా స్వర్ణయోగ సిద్ధాంతాన్ని వొప్పుకున్నారని సిద్ధుడు చెప్పాడు. అయితే ఆచరణవిషయంలోనే కొన్ని చిక్కులున్నాయనికూడా చెప్పాడు. రోజూ రాత్రులు చాలాసేపు సిద్ధుడూ, సుందరయ్యా స్వర్ణయోగానికి ప్రయత్నాలు గడుస్తూండేవారు.

ఏ ఒంటిగంటకో సుందరయ్య ఇంటికొచ్చేవాడు. రోజులు గడుస్తున్నకొద్దీ సుందరయ్యకి ఇది పిచ్చిలా పట్టుకుంది. పగలంతా దాన్నిగురించే ఆలోచించేవాడు. రాత్రి అతనికి, తనేది ముట్టుకుంటే అది బంగారమయినట్టూ, బంగారం అవడం కోసం ఇల్లంతా తిరుగుతూ తను అన్నివస్తువులనీ ముట్టుకుంటున్నట్టూ కలలొచ్చేవి. మెలుకువ వొచ్చేసరికి తను ఏద్వారబంధందగ్గిరో పడివుండేవాడు.

హఠాత్తుగా వొకరాత్రి వాళ్లు పడుతున్న శ్రమకి ఫలితం కనిపించింది. వాళ్లు ఎక్కువగా వాడుతూవుండిన చిన్న వెండిపళ్లెం బంగారంగా మారిపోయింది ఆ రసాయనాలు తగలడంవల్ల. ఆశ్చర్య సంభ్రమాలతో సిద్ధుడూ సుందరయ్యా వుక్కిరిబిక్కిరి అయ్యారు.

"పంతులూ, మనం ఈ బంగారం ఇక్కడ పెట్టడం క్షేమంకాదు. నేను క్షేమంగా వొకచోట దాచుతాను. పదిహేను రోజులవరకూ రోజుకొక వెండివస్తువు చొప్పున బంగారంచేసి, తరవాత ధర్మంగా నీకెంతవస్తుందో అంతా తీసుకుందువుగాని" అన్నాడుసిద్ధుడు సుందరయ్యతో.

మంచి సంతోషంలో వున్నాడేమో, సుందరయ్య సరే నన్నాడు.

సుందరయ్యకి ఆ రాత్రి నిద్రపట్టలేదు...తాము సాధించినవిజయం అతనికి నిద్రపట్టనివ్వలేదు. సుందరయ్య ఆలోచించాడు ... బాగానేవుంది. మొత్తానికి బంగారం కనిపెట్టారు...కాని సిద్ధుడు చిత్రంగా ప్రవర్తించాడు ... స్వార్థరహితంగా, శాంతంగా, తనతో సమానంగా శ్రమపడుతూ, సమష్టిగా పనిచేస్తూ, కార్యసిద్ధి కాగానే బంగారం

తనే రహస్యంగా దాచడానికి ఏర్పాటు చేశాడు!...ఎంత గడుసు!

సుందరయ్యకి యోగి నిజాయితీమీద నమ్మకం తగ్గింది. యోగం పేరుతో తన వెండివస్తువులన్నీ బంగారం చేసుకుని తనకి తెలియకుండా ఎప్పుడో వుడాయిస్తే తనేమవాలి ?... సొమ్ముపోయి దిమ్మకొట్టి, దొంగకి తేలుకుట్టినట్లయిపోవలసిందేగా? అరిచి నలుగురికీ చెపితే తను యాగీపడటమేగా మిగిలేది?

మరునాడు సుందరయ్యా, సిద్ధుడూ, వెండిమరచెంబు బంగారపు మరచెంబుగా మార్చారు. ఇద్దరూ కలిపి ఆ పనిచేసి విజయం సాధించినప్పుడు, ఒకళ్ళకి తెలియకుండా ఒకరు బంగారం దాచవలసిన పనిలేదనీ, దాచిన ప్రదేశం ఇద్దరికీ తెలియడంలో దోషమేమీలేదనీ సుందరయ్య అన్నాడు.

సిద్ధుడు చిరునవ్వునవ్వాడు—

"నన్ను నువ్వు అనుమానిస్తున్నావు. నీతప్పులేదు నాయనా- ఆతప్పు ఈ ధనానిది- మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః. నన్ను నమ్మితే నువ్వు చెడిపోవు. నమ్మకపోతే నువ్వే పట్టుకెళ్ళి జాగ్రత్తగా దాచు. నువ్వంటే నాకు నమ్మకమే."

సుందరయ్య తలవంచుకున్నాడు. తను అనవసరంగా సిద్ధుణ్ణి అనుమానించాడు. అరిషడ్వర్గాలకి అతీతుడైన సిద్ధుడు తనకి ద్రోహం తలపెట్టడు. "ఫరవాలేదు, తమరే దాచండి" అని చెప్పి ఇంటికి బయలుదేరాడు.

సిద్ధుడి మనసు మంచిదే అయివుండొచ్చు... తనమీద అతనికి ద్రోహబుద్ధి అతనికి లేకపోవచ్చు. కాని సిద్ధుడు ఎక్కడ దాచగలడు? తన గదిలో తనకే రక్షణలేదే? ఇవతల కొచ్చి ఏ చెట్టుకిందో పాతిపెడతాడు. పొరపాటునగాని ఈ కొండమీద ఏ చెట్టు మొదట్లోనైనా-

సుందరయ్య వొళ్లు ఝల్లుమంది. నిన్న సాయంకాలం సిద్ధుడు కొండమీద మర్రిచెట్టుదగ్గరనుంచి రావడం తను చూశాడు. ఆ విషయం అప్పుడంత ప్రధానమైనదిగా తనకి అనిపించలేదు. ఇప్పుడు తట్టింది, ఆ మర్రిచెట్టుకిందగాని పాతిపెట్టలేదు కదా! ఎవరో వొకరు అలా పోతూనే వుంటారు. ఎవరైనా తవ్వుకు తీసుకుపోతే?

సుందరయ్య తనని తను సంబాళించుకున్నాడు. అంత అనుమానం కూడదు. తన భయంకొద్దీ తను వూహించుకుంటున్నాడంతే.

ఆ రాత్రి సుందరయ్యకి బంగారు వస్తువులు తనే వెళ్ళి తెచ్చుకున్నట్టు కల వచ్చింది. పొద్దున్నే నిద్రలేచి చూస్తే తలగడమీద బంగారు మరచెంబు మూత కనబడింది.

సుందరయ్య ఖంగారుగా లేచి నుంచున్నాడు. ఈ మూత ఇక్కడ కెలా వచ్చింది? ... అన్ని తలుపులూ వేసివున్నాయి!

రాత్రి కల రావడం లీలగా జ్ఞాపక ముంది. మూత చేతిలో వుండిపోయి మరచెంబు నీళ్ళల్లో 'బుడంగు'న మునిగినట్లు కాబోలు కల!

ఏ దయ్యాలేనా తీసుకొచ్చి పడెయ్యలేదుకద!

ఈ సంగతి సుందరయ్య సిద్ధుడితో చెప్పలేదు. సిద్ధుడుకూడా ఏమీ ప్రస్తావించలేదు. ఆ రోజు రాత్రి వెండికంచం బంగారుకంచంగా మార్చారు. వెళ్ళొస్తానని చెప్పి సుందరయ్య యింటికి బయల్దేరి వస్తున్నాడు. దారిలో ఆలోచనలు ఆకాశాలు దాటుతున్నాయి. తనకీ సిద్ధుడికీ తెలియకుండా ఏదో మాయ జరుగుతోంది. తనకి కలరావటం ఏమిటి, ఆ ప్రకారం మెళుకువ వచ్చేటప్పటికి నిదర్శనాలు కనబడటమేమిటి?... లేకపోతే తన దగ్గర బంగారుమూత ఎందుకుంటుంది?...మిగతా వస్తువులు అక్కడలేవనీ, ఎక్కడో ఇద్దరికీ కనబడని చోట ఏదోశక్తి దాచేస్తోందనీ భావించాడు.

ఆ రాత్రి సుందరయ్యకి మళ్ళీ కలవచ్చింది...

* * *

సన్నగా కురుస్తున్న జల్లు కొద్దిగా పెద్దదయింది.

అపరిచితుడు కథచెప్పటం కాస్సేపు ఆపాడు. రాఘవులుకి చాలా కుతూహలం కలిగింది. ఏదో పేదరాసి పెద్దమ్మలాగ కథప్రారంభించి, సోమ్నాంబులిజమూ, సప్రెస్డు వాంఛలూ చెప్పి ఫ్రాయిడ్ కూడా ఖంగారు పడేలా ఇంకా ఏం చెప్తాడో అని చూస్తున్నాడు.

కొత్తమనిషి గొంతు సవరించుకొని మళ్ళీ ప్రారంభించాడు.

* * *

ఆ రాత్రి సుందరయ్యకి మళ్ళీ కలవచ్చింది. అదే సుందరయ్య చివరికల!...సుందరయ్య లేచి

తలుపుతీసుకుని వెడుతున్నాడుట! ... మర్రిచెట్టు దగ్గర ఆగి, చెట్టుమొదట్లో మట్టి తవ్వుతున్నాడుట! గొయ్యితీస్తూ మట్టి దోసిళ్ళతో ఇవతల పోస్తూం డగా... వెనకగా ఎవరో నెత్తిమీద కర్రతో మోదినట్లయింది! ... సుందరయ్యకి నిద్రవదలి మెళుకువొచ్చి చూస్తే ఎదురుగా మనిషి కర్రపట్టుకు నుంచున్నాడు! ...సుందరయ్య స్పృహతప్పిపడి పోయాడు. తరవాత దెబ్బకి సుందరయ్య చచ్చి పోయాడు.

చెట్టుక్రింద చచ్చిపడివున్నది సుందరయ్యేగాని మరొకడెవడూకాదని సిద్ధుడు గ్రహించాడు. సిద్ధుడుకి సుందరయ్య ఇంట్లో బంగారు మరచెంబు మూత దొరికింది. ఇల్లాంతా వెతగ్గా మరచెంబూ, పళ్ళెమూ సుందరయ్య ఇంటెనూతిలో దొరికాయి సిద్ధుడికి.

* * *

"ఏమయితేనేం, సుందయ్య బలవంతపు చావు చచ్చాడు" అని నిట్టూర్చాడు అపరిచితుడు.

రాఘువులు కథంతా విన్నాడు. కథ ఎంతో అసందర్భంగానూ, అబద్ధంగానూ అనిపించింది. అయినా, కథ తనకి గమత్తుగానేవుంది. రాఘువులుకి మరీ ఘోరమయిన లోటులు కనిపించాయి. రాఘు వులు నవ్వసాగాడు.

"నవ్వుతావేం?" అని అడిగాడు కొత్తమనిషి.

"నవ్వక ఏంచెయ్యమంటావు? నీ కథంతా నేను నమ్ముతున్నానని నువ్వనుకుంటున్నావు, అవునా?"

"ఇందులో అబద్ధం ఏముంది?"

"ఇందులో నిజం ఏముంది, అని అడుగు. ఈ కథ సరిగ్గా ఇద్దరు వ్యక్తులమధ్య జరిగిన రహస్య చరిత్ర. నీకెలా తెలిసింది?"

"పంతులూ, ఒక సంగతి,..."

"సుందరయ్యకి కలలొచ్చేవా? అతనికి కలలో ఏం కనబడిందో నీకెలా తెలుసు? అతనికి చచ్చి పోయే ముందు కల వచ్చిందన్నావు. కల ముగిసే టప్పటికి చచ్చిపోయా డన్నావు. అతనికి కలలో ఏమి కనబడిందో, ఆ వివరాలన్నీ ఎలా చెప్పగలుగు తున్నావు? నువ్వు చెప్పేది పచ్చి అబద్ధమేనా అయివుండాలి, లేకపోతే..."

ఆకాశంలో మెరుపుతోపాటు రాఘువులు బుర్రలో చిన్న మెరుపు మెరిసింది. వెర్రిధైర్యం కలిగింది.

"కథ పచ్చి అబద్ధమేనా అయివుండాలి, కాక పోతే సుందరయ్యని చంపినది నువ్వేనా అయి వుండాలి. ఆగు...దీనికి సమాధానం చెప్పు. సుంద రయ్య నిద్దరలో మర్రిచెట్టుకిందకి నడిచాడు. అతనికి నిద్దరలో నడిచే జబ్బుంది. అతను నిద్దరలో మర్రిచెట్టుకిందికి నడిచాడు. నువ్వు చెట్టుదగ్గర వున్నావు. అతను వంగినప్పుడు నువ్వు అతన్ని కర్రతో కొట్టావు...ఉండు...ఉండు..."

"ఓయ్, పంతులూ! నేను చెప్పిన కథ అబద్ధం కాదు. నేను హంతకుణ్ణి కాదు. నే నెవర్నో తెలుసా?" అని గట్టిగా అడిగాడు ఆ పెద్దమనిషి.

రాఘువులికి ఏదో పూనినట్లయింది. విజయ గర్వం మొహంలో వెలిగింది.

"ఆ. తెలుసు. నువ్వే హంతకుడివి. నువ్వే ఆ సిద్ధుడివి. బంగారమ్మ కొండదగ్గరనుంచే నువ్వు నన్ను కేకేశావు. సుందరయ్య ఇంట్లో నుయ్యి ఎక్కడుందో కూడా నీకు తెలుసు. బంగారం సంగతి నీకూ సుందరయ్యకీ తప్ప మరెవ్వరికీ తెలియదు. బంగారంకోసం నీతో సమానంగా శ్రమించిన సుందరయ్యని దారుణంగా చంపావు."

హోరున వానకురవడం మొదలుపెట్టింది. బ్రహ్మాండమయిన గొంతుకతో అపరిచితుడు ఇల్లా అన్నాడు:

"నేను చెప్పిన విషయం ఈషన్మాత్రమూ అబ ద్ధంకాదు. నేను హంతకుణ్ణికాదు. సిద్ధుణ్ణికాదు. నేను... నేను... నేను సుందరయ్యని!"

పెద్దమెరుపు మెరిసింది. చూస్తూండగా ఫెళ ఫెళమంటూ పిడుగొకటి బంగారమ్మ కొండమైనున్న మర్రిచెట్టుమీద పడింది. వాన జోరు హెచ్చి పోయింది.

ఇంతసేపటినుంచీ తను దయ్యాలమిట్ట చుట్టూ తిరుగుతున్నట్టూ, ఇప్పుడు తను మిట్టమీద నుంచు న్నట్టూ గ్రహించాడు రాఘువులు.

కొత్తమనిషి మాయమయ్యాడు.

* * *

తదేకదీక్షగా శూన్యంలోకి కాస్సేపుచూసి, గిరుక్కున నావైపుతిరిగి, "వొకమాటు రాఘువుల్ని చూసొద్దాం, లేవరా!" అన్నాడు టార్జాన్. ★